## ఎండిన పంటలు..



ధూళిమిట్ట మండలంలోని బైరాన్‌పల్లిలో ఎండిన వరి పొలం

మద్దూరు, ధూళిమిట్ట మండలాల్లో నీళ్లులేక పంటలు ఎండుతుండగా, భూగర్భ జలాలు అడుగంటి బోరుబావులు ఎండిపోతున్నాయి. పంటలను కాపాడుకునేందుకు రైతులు నానాపాట్లు పడుతున్నారు. రైతులు పగలు, రాత్రి అనే తేడా లేకుండా పొలాల వద్దే కాపు కాస్తూ వంతుల వారీగా మడులను తడుపుతున్నారు. అయినా పొలాలకు సరిపడా నీళ్లందక పంటలు ఎండిపోతుండగా, చేసేదేమీ లేక రైతులు పొలాలను పశువులకు మేతగా వదిలేస్తూ ఆవేదన చెందుతున్నారు. ఉమ్మడి మద్దూరు మండలంలోని చెరువులు, కుంటలను గోదావరి జలాలతో నింపి తమను ఆదుకోవాలని పలు గ్రామాల రైతులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. – మద్దూరు (ధూళిమిట్ట), మార్చి 22



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న జడ్పీ వైస్‌చైర్మన్ రాజిరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు

## బాధిత కుటుంబాలకు పరామర్శ

హుస్నాబాద్, మార్చి 22: హుస్నాబాద్ మండలంలోని పందిల్ల, పొట్లపల్లి గ్రామాల్లో బాధిత కుటుంబాలను జడ్పీ వైస్‌చైర్మన్ రాయిరెడ్డి రాజిరెడ్డి స్థానిక బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులతో కలిసి శుక్రవారం పరామర్శించారు. పందిల్లలో తాటికొండ గురువారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, గూళ్ల గట్టయ్య కుటుంబ సభ్యులను, పొట్లపల్లిలో మాజీ ఉపసర్పంచ్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంగం మధుసూదన్‌రెడ్డి, నాయకులు ఎడబోయిన తిరుపతిరెడ్డి, అలుమల్ల ప్రభాకర్‌రెడ్డి, చింతకింది వెంకట స్వామి, ఎల్లాగౌడ్, మాజీ సర్పంచ్‌లు తోడేటి రమేశ్, చంద్రమౌళి ఉన్నారు.

## ఘనంగా జగద్గురు రేణుకాచార్య జయంతి

మల్లన్న ఆలయంలో రేణుకాచార్య జయంతి నిర్వహిస్తున్న అర్చకులు

చేర్యాల, మార్చి 22 : కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయంలోని రేణుకాచార్య మఠంలో శుక్రవారం ఆది జగద్గురు రేణుకాచార్య జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి రుద్రాభిషేకం చేశారు. అనంతరం మల్లన్న ఆలయ ప్రధానార్చకుడు మహాదేవురని మల్లికార్జున్ మాట్లాడుతూ జగద్గురు రేణుకాచార్యులు మానవులంతా సమానమని, అందరికీ సమాన హక్కులు ఉండాలని 18 కులాలకు 18 మఠాలను ఆనాడే స్థాపించినట్లు తెలిపారు. కుల,వర్గ, వర్ణ,మత, స్త్రీ, పురుష భేదాలు లేకుండా మానవులంతా సమానమన్నారు. కార్యక్రమంలో అర్చకులు సాంబయ్య, ఆంజనేయులు, మల్లికార్జున్, భాస్కర్, మనోహర్, రవి, రేవణ సిద్ధేశ్వర్, శికుమార్, సూర్య, శివ ప్రసాద్, రాజు, ఆగమ పాఠశాల అధ్యాపకుడు వీరేశలింగం, విద్యార్థులు పాల్గొన్నారు.

## నీటిని పొదుపుగా వాడుకోవాలి

హుస్నాబాద్‌టౌన్, మార్చి 22: నీటిని పొదుపుగా వాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆరపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తిరుపతి అన్నారు. ప్రపంచ నీటి దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రాథమిక పాఠశాల విద్యార్థులు, బాలవికాస స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ఆరపల్లిలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హుస్నాబాద్ బాలవికాస స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్లు జ్యోతి, నిర్మల, పి.శ్రీమతి, ఉపాధ్యాయులు రాములు, కొమురయ్య, రాజ్యలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్త గంగుల ఇందిర, మహిళలు పాల్గొన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు, విద్యార్థులు

## రాజ్యాంగ సంస్థల దుర్వినియోగం

చేర్యాల, మార్చి 22: ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగ సంస్థలను దుర్వినియోగం చేస్తున్నదని కాంగ్రెస్ టౌన్ అధ్యక్షుడు మంచాల చిరంజీవులు ఆరోపించారు.ఫ్రీజింగ్ చేసిన కాంగ్రెస్ పార్టీ బ్యాంక్ అకౌంట్లను వెంటనే తెరిపించాలని డిమాండ్ చేస్తూ పట్టణంలో శుక్రవారం కార్యకర్తలు నిరసన చేపట్టారు. ఆయన మాట్లాడుతూ దేశంలో ఎలక్టోరల్ బాండ్ల ద్వారా అత్యధిక డొనేషన్లు బీజేపీ పార్టీకి వచ్చాయని, కాంగ్రెస్ పార్టీకి కేవలం 16శాతం మాత్రమే వచ్చాయ

నిరసన వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

న్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు చెవిటి లింగం, సందుల సురేశ్, నాయకులు పుర్మ ఆగంరెడ్డి, తుమ్మలపల్లి సంజీవులు, బండెల మహిపాల్‌రెడ్డి, శ్రీకాంత్, కాశెట్టి ఉపేందర్, నీలం సన్నీ, ప్రసాద్, కృష్ణ పాల్గొన్నారు.

## పేద విద్యార్థినులకు చేయూత

గజ్వేల్, మార్చి 22: మండలంలోని కోమటిబండ గ్రామానికి చెందిన ఉబ్బని మల్లయ్య భారతి దంపతుల కుమార్తెలు మల్కాజిగిరిలోని ప్రైవేట్ కళాశాలలో జీఎన్ఎం కోర్సు చేస్తున్నారు. నిరుపేద కుటుంబం కావడంతో పిల్లల చదువు భారంగా మారింది. పిల్లల కళాశాల ఫీజులు కట్టడం ఇబ్బందిగా మారడంతో స్థానికులు ఈ విషయాన్ని ముదిరాజ్ సంఘం నాయకుడు, కాంగ్రెస్ నాయకుడు నీలం మధు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన పిల్లల చదువుల కోసం రూ.10వేల ఆర్థిక సాయాన్ని పంపించాడు. దీంతో శుక్రవారం తల్లిదండ్రులకు ముదిరాజ్ సంఘం రాష్ట్ర నాయకుడు శ్రీనివాస్, గ్రామ మాజీ సర్పంచ్ శేఖర్, ప్రభాకర్, రమేశ్ అందజేశారు.

ఆర్థికసాయం అందజేస్తున్న నాయకులు

## అధిక సాంద్రత పత్తి సాగుపై శిక్షణ

చేర్యాల, మార్చి 22: మండలంలోని ముస్త్యాల రైతు వేదికలో కృషి విజ్ఞాన కేంద్రం మెదక్,నూజీవీడు సీడ్స్ సౌజన్యంతో శుక్రవారం అధిక సాంద్రత పత్తి సాగుపై రైతులకు శిక్షణ ఇచ్చారు. మండల వ్యవసాయశాఖ అధికారి అప్రోజ్ ఆధ్వర్యంలో శిక్షణ కొనసాగింది. ప్రొఫెసర్ రవికుమార్, కీటకశాస్త్ర విభాగం ప్రొఫెసర్ ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ.. ఎకరం పత్తి సాగుకు ఆరు ప్యాకెట్ల విత్తనాలు నాటుకోవాలన్నారు. ఎకరానికి పత్తి దిగుబడి 12 నుంచి 14 క్వింటాళ్ల వరకు వచ్చే అవకాశం ఉందని, ముఖ్యంగా ఈ

అవగాహన కల్పిస్తున్న ప్రొఫెసర్లు

పద్ధతి ఎర్రనేలలకు అనుకూలమన్నారు. వ్యవసాయ యాంత్రిక విభాగశాస్త్రం డాక్టర్ ప్రతాప్‌రెడ్డి, సేద్య విభాగ శాస్త్రవేత్తలు, న్యూజివీడు సంస్థ ప్రతినిధులు, ఏవో రామకృష్ణ, ఏఈవోలు కల్యాణి, రైతులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ శ్రేణుల సంబురాలు

దుబ్బాక టౌన్, మార్చి 22: మెదక్ పార్లమెంట్ అభ్యర్థిగా ఎమ్మెల్సీ వెంకట్రామిరెడ్డిని ప్రకటించడంతో దుబ్బాక బీఆర్ఎస్ శ్రేణులు హర్షం వ్యక్తంచేశాయి.ఈ సందర్భంగా పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం కేసీఆర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం సాయంత్రం స్థానిక బస్‌స్టాండ్ వద్ద పటాకులు కాల్చి స్వీట్లుపంచుకున్నారు. జట్పీటీసీ కడతల రవీందర్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర నాయకుడు రొట్టె రాజమౌళి, జిల్లా ఉపాధ్యక్షుడు గుండెల్లి ఎల్లారెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు ఆస యాదగిరి, బత్తు స్వామి, ఆస స్వామి, రేకుల కుంట మల్లిఖార్జునస్వామి ఆలయ చైర్మన్ రొట్టె రమేశ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బానాల శ్రీనివాస్, నాయకులు కొత్త కిషన్‌రెడ్డి, మల్లేశంగౌడ్, పర్స కృష్ణ, పడాల నరేశ్, రాధామనోహర్‌రెడ్డి, ఇస్మాయిల్, పల్లె బోస్, నారాగౌడ్, ఇస్తారిగల్ల స్వామి తదితరులు పాల్గొన్నారు.



దుబ్బాక టౌన్: వెంకట్రామిరెడ్డికి మెదక్ ఎంపీ టికెట్ కేటాయించడంతో దుబ్బాకలో హర్షం వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

### బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపిస్తాం

చిన్నకోడూరు, మార్చి 22: మెదక్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి పి.వెంకట్రామ్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపిస్తామని ఆ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వనితారవీందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం చిన్నకోడూరులో వారు విలేకరులతో మాట్లాడారు. మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలను కలుపుకొని మెదక్ బీఆర్ఎస్ అభ్యర్థి తరపున ఇంటింటి ప్రచారం చేస్తామన్నారు.

పాలమాకులలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

### వెంకట్రామిరెడ్డి గెలుపు ఖాయం

నంగునూరు, మార్చి 22: మెదక్ పార్లమెంట్ అభ్యర్థిగా ఎమ్మెల్సీ వెంకట్రామిరెడ్డి గెలుపు ఖాయమని బీఆర్ఎస్ నంగునూరు మండల నాయకులు అన్నారు. మండలంలోని పాలమాకులలో శుక్రవారం వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..మెదక్ పార్లమెంట్ అభ్యర్థిగా వెంకట్రామిరెడ్డిని భారీ మెజారిటీతో గెలుపించేందుకు ప్రతి కార్యకర్త పనిచేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. సమావేశంలో మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్లు ఎడ్ల సోమిరెడ్డి, వెంకట్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు లింగంగౌడ్, పీఏసీఎస్ చైర్మన్లు మహిపాల్‌రెడ్డి, కోల రమేశ్‌గౌడ్, నాయకులు వేణు చక్రవర్తి, కుమార్,ఐలయ్య, వెంకటేశ్, పరశురాములు తదితరులు పాల్గొన్నారు.

## నష్టపోయిన రైతులను ఆదుకుంటాం

- రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్

విజ్ఞప్తులు స్వీకరిస్తున్న మంత్రి పొన్నం

హుస్నాబాద్, మార్చి 22: ఇటీవల కురిసిన వడగండ్లతో పంట నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నదని రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శుక్రవారం హుస్నాబాద్‌లోని క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో సిద్దిపేట రూరల్, చిన్నకోడూరు, బెజ్జంకి తదితర మండలాల్లో సుమారు 2,800 ఎకరాల్లో పంటనష్టం జరిగిందన్నారు. నష్టపోయిన రైతులెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అందరినీ ఆదుకుంటామన్నారు. ఇప్పటికే పంటనష్టం అంచనాలు వేసి అధికారులు ప్రభుత్వానికి పంపారన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో తాగునీటి ఎద్దడి నివారణకు తనకు కేటాయించిన నిధులను మొత్తం వెచ్చిస్తున్నట్లు చెపారు. అవసరమైతే అదనపు నిధులు కూడా తెప్పించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. తాగునీటి ఇబ్బందులు ఉన్న గ్రామాలను గుర్తించాలని అధికారులను ఆదేశించామన్నారు. చిన్నచిన్న కేసులతో పలువురు ఉద్యోగోన్నతులు, నియామకాల్లో అన్యాయం జరుగుతుందనే విజ్ఞప్తులు వస్తున్నందున ఇలాంటి సమస్య ఉన్న ఉద్యోగుల కోసం సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. అనంతరం ప్రజల నుంచి విజ్ఞప్తులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## పటిష్ట ఏర్పాట్లు చేయాలి

- కలెక్టర్ మను చౌదరి

ఈవీఎం గోడౌన్ వద్ద అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ మను చౌదరి

సిద్దిపేట అర్బన్, మార్చి 22: పటిష్ట ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ మను చౌదరి అధికారులను ఆదేశించారు. శుక్రవారం పార్లమెంట్ ఎన్నికల ప్రక్రియలో భాగంగా కలెక్టరేట్ సమీపంలోని ఈవీఎం గోడౌన్‌ను ఆయన సందర్శించారు. ఎన్నికల్లో ఉపయోగించేందుకు ఈవీఎం యంత్రాలను సిద్ధం చేసి, ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం చేయాల్సిన ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో ఆయన పరిశీలించారు. గోడౌన్ చుట్టూ 24 గంటలు విధులు నిర్వహించాలని పోలీస్ అధికారులకు తెలిపారు.

**సమర్థవంతంగా విధులు నిర్వహించాలి**

లోక్‌సభ ఎన్నికల నిర్వహణలో ఎంసీఎంసీకి కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ మనుచౌదరి సూచించారు. శుక్రవారం ఆయన కలెక్టరేట్‌లో మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వివిధ పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియాలో వచ్చే పెయిడ్ న్యూస్‌ల గుర్తింపు, పొలిటికల్ అడ్వర్టైజ్‌మెంట్ల ప్రీ సర్టిఫికేషన్, మానిటరింగ్ ఇతర మీడియా సంబంధిత విధులను ఎన్నికల సంఘం నిబంధనలకు లోబడి నిర్వహించాలని సూచించారు.

## కుంటను పరిశీలించిన ఇరిగేషన్ డీఈఈ

అక్కన్నపేట, మార్చి 22: మండల కేంద్రం సమీపంలోని బావండ్ల కుంటను మిట్టపల్లి సత్యం అనే వ్యక్తి కబ్జాచేసి మరమ్మతులు చేస్తున్నాడని అక్కన్నపేట మత్స్య పారిశ్రామిక సహకార సంఘం సభ్యులు శుక్రవారం ఇరిగేషన్ జిల్లా ఈఈ వెంకట కిషన్‌రావుకు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై స్పందించిన ఆయన వెంటనే క్షేత్రస్థాయిలో విచారణ చేయాలని హుస్నాబాద్ డివిజన్ డీఈఈ మధుసూదన్‌ను పంపించారు. రెవెన్యూ గిర్దావర్ యాదగిరితో కలిసి కుంటను సందర్శించిన డీఈఈ విచారణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుంట కబ్జాపై విచారణ చేశామని, వేదికను ఉన్నతాధికారులకు పంపిస్తామన్నారు.

## నీటిని పొదుపుగా వాడుకోవాలి

ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

మద్దూరు(ధూళిమిట్ట), మార్చి 22: నీటిని పొదుపుగా వాడుకోవాలని మద్దూరు మండలంలోని సలాఖపూర్ ఎంపీటీసీ ఇర్రి రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం గ్రామంలోని ఉన్నత పాఠశాలలో బాల వికాస సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ నీటి దినోత్సవాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మానవ మనుగడకు నీరు అవసరమని, నీటి సంరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అంతకుముందు నీటిని పొదుపుగా వాడుకుంటామని విద్యార్థులు, గ్రామస్తులు సామూహికంగా ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం రేష్మా, బాల వికాస ప్రతినిధి విమల్, మాజీ సర్పంచ్ బందారం శ్రీనివాస్, వాటర్‌ప్లాంట్ అధ్యక్షుడు ఇర్రి రాఘవేందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### అలయన్స్ క్లబ్‌కు అవార్డులు

అవార్డు అందుకుంటున్న అలయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ సోమ వనజ

సిద్దిపేట టౌన్, మార్చి 22: సిద్దిపేట అలయన్స్ క్లబ్ ఉత్తమ సేవలకు అవార్డులు వరించాయి.అలయన్స్ క్లబ్ అంతర్జాతీయ సదస్సు ఆగ్ర వేదికగా శుక్రవారం జరిగింది. అందులో భాగంగా సిద్దిపేట అలయన్స్ క్లబ్ ఉత్తమ గవర్నర్‌గా సోమవనజ, బెస్ట్ వెస్ గవర్నర్‌గా చకిలం రామచంద్రం, ఐసీసీగా మోర అంజయ్యలకు అలయన్స్ క్లబ్ అంతర్జాతీయ అధ్యక్షుడు పంకజ వాస్తవ అవార్డులు అందజేశారు.కార్యక్రమంలో రాజేశ్వర్‌రెడ్డి, శివకుమార్, రామచంద్రం, లావణ్య పాల్గొన్నారు.

## న్యాయవాద వృత్తి గౌరవమైనది

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి రఘురామ్

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి రఘురామ్

సిద్దిపేట టౌన్, మార్చి 22: న్యాయవాద వృత్తి గౌరవమైనదని జిల్లా ప్రధాన న్యాయమూర్తి రఘురామ్ అన్నారు.జిల్లా నాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో వినాయక లా కళాశాల విద్యార్థులకు గురువారం రాత్రి లీగల్ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదువుకొని న్యాయవాదులు, న్యాయమూర్తులుగా ప్రజలకు సేవలందించాలని ఆకాంక్షించారు.లా కోర్సు పూర్తి చేసిన వారికి వివిధ రంగాల్లో మంచి అవకాశాలు ఉన్నాయన్నారు. అంతకుముందు లా విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు న్యాయమూర్తి సమాధానాలు చెప్పారు. కార్యక్రమంలో జడ్జీలు మురళీమోహన్, మిలింద్ కాంబ్లే, శ్రావణి యాదవ్, బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, న్యాయవాదులు పాల్గొన్నారు.

## వింతవ్యాధి నివారణకు చర్యలు చేపట్టండి

- రైతు రక్షణ సమితి నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి రవీందర్‌గౌడ్

మాట్లాడుతున్న రవీందర్‌గౌడ్

హుస్నాబాద్, మార్చి 22: హుస్నాబాద్ ప్రాంతంలో రెండేండ్ల లోపు వయస్సు ఉన్న పశువులకు సోకుతున్న వింతవ్యాధి నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని రైతు రక్షణ సమితి నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి పచ్చి మట్ల రవీందర్‌గౌడ్ సంబంధిత అధికారులను కోరారు. శుక్రవారం హుస్నాబాద్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. పశువులకు వస్తున్న వ్యాధి గురించి వెటర్నరీ వైద్యులకు వివరించగా అది లంపీ స్కిన్ డిసీజ్‌గా చెప్తున్నారన్నారు. ఇది కొన్ని నెలలుగా పశువులకు సోకుతున్నప్పటికీ అధికారులు ముందస్తు చర్యలు చేపట్టడంలో నిర్లక్ష్యం చేశారన్నారు. అధికారులు, వైద్యుల నిర్లక్ష్యం కారణంగా హుస్నాబాద్‌తో పాటు చుట్టుపక్కల మండలాల్లో 30వరకు లేగదూడలు లంపీస్కిన్ వ్యాధి వల్ల మృత్యువాత పడ్డాయన్నారు. దీని నివారణకు టీకాలు అందుబాటులో లేవని, వెంటనే మందులు అందుబాటులోకి తెచ్చి వ్యాధి నివారణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. వ్యాధి ప్రబలకుండా ఉండాలంటే హుస్నాబాద్‌తో పాటు మండల కేంద్రాల్లో జరుగుతున్న పశువుల సంతలను నెల రోజులు నిర్వహించొద్దని, లేకుంటే అధిక సంఖ్యలో పశువులు మృత్యువాతపడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ స్పందించి పశువులకు సోకుతున్న లంపీస్కిన్ వ్యాధినివారణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

## పట్టణాభివృద్ధికి సహకరించాలి

పన్నులు తీసుకుంటున్న కమిషనర్ నర్సయ్య

చేర్యాల, మార్చి 22 : వ్యాపార, వాణిజ్య సంస్థలతో పాటు అన్ని వర్గాల ప్రజలు మున్సిపాలిటీకి బకాయి ఉన్న పన్నులు చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ గోల్కండ నర్సయ్య కోరారు. శుక్రవారం ఆయన పట్టణంలోని పెట్రోల్ బంకులు, పాఠశాలలు, రైస్ మిల్లులను సందర్శించి పన్నులు వసూలు చేయడంతో పాటు ఇంటి పన్నులపై 90 శాతం ఉన్న వడ్డీ రాయితీ గురించి యజమానులకు అవగాహన కల్పించారు.అనంతరం దోమల నివారణ కోసం మురుగు కాల్వలను శుభ్రం చేయించి మందును పిచికారీ చేయించారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ జె.ప్రభాకర్, సర్వర్ శ్రీనివాస్, బాలకృష్ణ, గంగాధర్, వెంకటేశ్ పాల్గొన్నారు.

## చిరుధాన్యాలను వినియోగించాలి

మద్దూరు(ధూళిమిట్ట), మార్చి22: ఆరోగ్యంగా ఉండాలంటే ఆహారంలో చిరుధాన్యాలను విరివిగా వినియోగించాలని ఏసీడీఎస్ సూపర్‌వైజర్ పుష్పలత అన్నారు. శుక్రవారం ధూళిమిట్ట మండలంలోని మల్లన్నగుట్ట రైతువేదికలో పోషణ్ పక్వాడా కార్యక్రమాన్ని నిర్వహించారు. అంతకుముందు చిరుధాన్యాల వల్ల కలిగే లాభాలపై గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బ్లాక్ కోఆర్డినేటర్ కనకరాజు, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## యోగాతో ఆరోగ్యం

యోగా చేస్తున్న బ్యాంక్ ఉద్యోగులు

సిద్దిపేట, మార్చి 23: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని యూనియన్ బ్యాంక్ రీజినల్ చీఫ్ హెడ్ వికాస్ అన్నారు. సిద్దిపేట పట్టణంలోని వ్యాస మహర్షి యోగా కేంద్రంలో యూనియన్ బ్యాంక్ ఉద్యోగులకు యోగా తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య పరిరక్షణకు, మానసిక ఒత్తిడిని దూరం చేసేందుకు యోగా ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో సీనియర్ మేనేజర్ విజయ భాస్కర్‌రెడ్డి,యోగా శిక్షకులు తోట సతీశ్, సంధ్య, చీఫ్ ప్యాట్రన్ ప్రభాకర్ పాల్గొన్నారు.

## ఘనంగా గంగభవానీ మాత ఆలయ వార్షికోత్సవం

చిన్నకోడూరు, మార్చి 22: మండల కేంద్రంలోని గంగభవాని ఆలయ 23వ వార్షికోత్సవాన్ని గంగపుత్రులు శుక్రవారం నిర్వహించారు. మహిళలు పెద్దఎత్తున బోనాలు సమర్పించి ఆశీస్సులు తీసుకున్నారు. కమిటీ అధ్యక్షుడు మల్యాల ఉప్పలయ్య మాట్లాడుతూ ప్రతి ఏడాది గంగభవానీ ఆలయ వార్షికోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గంగపుత్ర సంఘం అధ్యక్షుడు లక్ష్మయ్య, ఉపాధ్యక్షుడు రమేశ్, భిక్షపతి, భాస్కర్, కనకయ్య, లక్ష్మణ్, రాకేశ్, మల్యాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ఘనంగా మహా చండీయాగం

మహాచండీయాగం నిర్వహిస్తున్న వేదపండితులు

కొమురవెల్లి, మార్చి 22: మండలంలోని రసూలాబాద్‌లో అష్టదశలక్ష్మీదుర్గా అమ్మవారి ఆలయం ఆవరణలో శుక్రవారం మహాగురుసేవ సమితి హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో మహా చండీయాగంని ర్వహించారు. ఈ సందర్భంగా కలశపూజ, అష్టోత్తరశత కలశాభిషేకం, రాత్రి పూర్ణాహుతి, తీర్థ ప్రసాద వితరణ చేశారు.కార్యక్రమంలో నిర్వాహకులు దరిపల్లి కుమార్, వేదపండితులు, భక్తులు పాల్గొన్నారు.

## వీరబ్రహ్మేంద్ర స్వామి విగ్రహప్రతిష్ఠ

బెజ్జంకి, మార్చి 22:మండల కేంద్రంలో విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయంలో శుక్రవారం విగ్రహప్రతిష్ఠ చేసి పూజలు చేశారు. అనంతరం అన్నదానం చేశారు.

## విద్యార్థుల జీవితాలు మారలేదు

చేర్యాల, మార్చి 22 : పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని అఖిల భారత విద్యార్థి బ్లాక్ రాష్ట్ర కార్యదర్శి పుల్లని వేణు కోరారు. శుక్రవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా విద్యార్థుల జీవితాలు మాత్రం మారలేదన్నారు. రెండో సంవత్సరం పూర్తికావస్తున్నా బీఈడీ, పీజీ విద్యార్థుల స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల కాలేదన్నారు. సమావేశంలో నాయకులు ఆత్మకూరు హరికృష్ణ, ఎర్రోళ్ల అఖిల్, నంగి తిరుపతి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ స్థలాల పరిరక్షణ కమిటీ నియామకం

జగదేవ్‌పూర్ మార్చి22: ప్రభుత్వ స్థలాలను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ప్రభుత్వ స్థలాల పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు కొత్తవెంకటనర్సింహారెడ్డి, కన్వీనర్ మునీర్ అన్నారు. శుక్రవారం జగదేవ్‌పూర్‌లో గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ప్రభుత్వ స్థలాల పరిరక్షణ కమిటీని నియమించారు. కమిటీ అధ్యక్షుడిగా వెంకటనర్సింహారెడ్డి, కన్వీనర్‌గా మునీర్, ఉపాధ్యక్షులుగా కనకయ్య, రమేశ్, మచ్చనర్సయ్య, సంయుక్తకార్యదర్శులుగా మహేశ్, నర్సింహులు, కోశాధికారిగా మహమ్మద్ జహంగీర్, సలహాదారులుగా మచ్చనర్సింహులు, దోమ నర్సింహులు, కొత్తభీంరెడ్డిశ్రీనివాస్‌రెడ్డి, రాచకొండ బాల్‌నర్సయ్య, కార్యవర్గ సభ్యులుగా అబ్బల్‌కలీం, కోరమైన గిరి, దాచారం బాల్‌నర్సయ్య ఎన్నికయ్యారు.

## నాణ్యమైన పరిశోధనలే దేశ ప్రగతికి గీటురాయి

సిద్దిపేట టౌన్, మార్చి 22: నాణ్యమైన పరిశోధనలే దేశ ప్రగతికి గీటురాయి అని సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రసాద్ అన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల కామర్స్ విభాగం ఆధ్వర్యంలో రెండు రోజులు నిర్వహించే జాతీయ స్థాయి సదస్సు శుక్రవారం ప్రారంభమైంది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..'పరిశోధన పద్ధతులు నిధుల కోసం మార్గాలు' అనే అంశంపై జాతీయ సదస్సు నిర్వహించినట్లు తెలిపారు. అధ్యాపకులు రాజు, గోపాలసుదర్శనం, అయోధ్యరెడ్డి, రాజేందర్, సంధ్యారాణి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ఏఎస్సైకి సేవా పతకం

చేర్యాల, మార్చి 22 : చేర్యాల పీఎస్‌లో ఏఎస్సైగా విధులు నిర్వహిస్తున్న నవీన్‌కు మార్ పోలీస